కథా నిలయం
4673
శ్రీకాకుళం

# రాతిలో తేమ

'ధరమం బాబూ'.

గల్లా పెట్టె వద్ద కూర్చుని నోట్ల లెక్కింపులో నిమగ్నుడైన చలమయ్యకి వినిపించలేదు.

దరమ సెయ్యి దాగదు బాబూ..'

ఈసారి బిచ్చగాని ఆర్తి కొంచెం స్పష్టంగానే వ్యక్తమయింది.

జరిపోతున్న సులోచనాలు సరిచేసుకుని చలమయ్య వీధి వంక చూశాడు.ఏమనుకున్నాడో యేమిటో ఇరవై అయిదు పైసల నాణెం గిరాటు వేశాడు. అది పక్క కొట్టు దగ్గరపడింది. దాన్ని చకోర పక్షిలా బిచ్చగాడు తీసుకోబోతుంటే పక్కకొట్టు యజమాని 'రాతిలో నీళ్లు తెప్పించావ్. మొండి ఘటాగనివే' అన్నాడు.

ఆ మాటలు చలమయ్య చెవికి డప్పుమోతలా వినిపించాయి. కోపం వచ్చింది. అణచుకున్నాడు. ఏదో గొణుక్కున్నాడు. గల్లాపెట్టెలో పెట్టిన నోట్లకట్టను తనివితీరా చూసి నవ్వుకున్నాడు. ఆ నవ్వుకి అంతరార్థం? డబ్బు దగ్గర తనలా ఖరాఖండీగా లేకపోతే తన కొట్టు కూడా పక్కకొట్టులా నష్టంలో నడిచేదని అర్థం కాబోలు! పక్క కొట్టు విషయం చలమయ్యకి బాగా తెలుసు. ఆ తృప్తితో ఆయన వీధి వంక చూపు నిలిపాడు.

'దరమ సెయ్యి సల్లగుండాల బాబూ...' అంటూ బిచ్చగాడు తన డబ్బాలో చేరిన పైసలు లెక్కపెట్టుకుంటున్నాడు.

ఉన్నట్టుండి చలమయ్యలో ఆత్మ విచారం బయలుదేరింది. తాను లెక్కపెట్టింది నోట్లు అతను లెక్కపెడుతున్నది చిల్లర... వీళ్లు వాళ్లు పేసిన నాణాలు... అంతా డబ్బే! అయితే అతనికి కలిగిన తృప్తి ముందు తన తృప్తి వెలవెలపోతోంది.

జీవితంలో మొదటిసారిగా చలమయ్య ఆలోచనలో పడ్డాడు. గల్లాపెట్టెను వెర్రిగా చూస్తుండిపోయాడు. వడ్డీ వ్యాపారం చేస్తున్న తనను చూసి నోట్ల కట్ట నవ్వుతున్నట్టు తోచింది. అది మామూలు నవ్వుగా లేదు. విషపునవ్వా... ఎగతాళి లాంటిదా... తేల్చుకోలేకపోతున్నాడు.

'ఏం చలమయ్యా... నీలో నువ్వు నవ్వుకుంటున్నావు. ఏమిటి కథ.'

అది పక్కకొట్టు యజమాని పలకరింపు...ఆలోచన లోంచి బయటపడ్డాడు చలమయ్య.

'ఏంలేదు బావా..' అన్నాడు. వాళ్లిద్దరూ బంధువులే. పని లేనప్పుడు పరిహాసాలాడుకోవడం వాళ్లకి అలవాటు.

'ఇంకా గుమాస్తా కుర్రాయన వచ్చినట్టు లేదే...'

'నాలుగైదు రోజులుగా ఆలస్యంగానే వస్తున్నాడు'

'ఇలా విడిచిపెడితే, ఆ తర్వాత మీదికెక్కి స్వారీ చేస్తాడు. నీకు నేను చెప్పాలా? నీకు తెలీదు కనకనా...'

పక్కకొట్టు యజమాని యిలా ధూపం వేస్తుండగా, గుమాస్తా వచ్చాడు – పీడకలకి భయపడ్డ వాడిలా.

'ఈ మధ్య మరీ ఆలస్యంగా వస్తున్నావు. ఏమిటి వ్యవహారం?' వచ్చిన కోపాన్ని ఒక్క పిసరైనా కనపించకుండా తేనె పూసిన కత్తిలా చలమయ్య అడిగాడు.

'మా అమ్మగార్ని ఆస్పత్రిలో చేర్పించక తప్పలేదు. చూసి తిన్నగా యిలా వచ్చేశానండి'.

'ఈ సంగతి ఎప్పుడూ యేమీ చెప్పలేదే.'

'నెల రోజులుగా మాటి మాటికి జ్వరం వస్తుంటే, నాటు వైద్యం చేయించాం. తగ్గకపోవడంతో మొన్న డాక్టరుగారు ఆస్పత్రిలో చేర్పించమన్నారు. జ్వరమేగదా అనుకుని మీతో యేమీ చెప్పలేదు...'

'మన వూళ్లో పెద్దాసుపత్రి వుండగా, నాటు వైద్యం ఎవరైనా చేయిస్తారా? ఈ కాలపు కుర్రాడివి నువ్వు. ఆ మాత్రం మీ నాన్నతో చెప్పలేకపోయావా?'

గుమాస్తా చెప్పలేక చెప్పాడు. ఫీజిచ్చుకోలేక నాటువైద్యం...'

'అది సరే, తెలీక అడుగుతున్నాను. నెల తిరక్కుండానే రెండొందలు అడ్వాన్సుగా తీసుకున్నావు...'

'మా నాన్న గారి జీతం చాలటంలేదు...'

'రేపిచ్చే జీతంలో యిది పట్టుకుంటే, మరీ తక్కువగా వస్తుందిగదా జీతం...'

'అవునండి'

'నీకేం లాభమని, యిలా ప్రతి నెలా జీతంపూర్తిగా తీసుకోకబోతే... ఎప్పుడూ బొర్రిపడుతోంది. బాగా ఆలోచించుకో...'

'మీ రన్నది నిజమే.. కాని...' సందేహించాడు.

'కుటుంబం గడవాలంటావు...'

'అవునండి.'

ఏదో చెప్పాలనుకున్న చలమయ్యా ఆగిపోయాడు, కొట్టుముందు అకాల వర్షంలా వచ్చి నిలబడ్డ పోస్టుమాన్‌ను చూసి.

'టెలిగ్రాం చలమయ్యగారూ' అంటూ అతను సమీపించడంతో, ఆయనకి వణుకు పుట్టుకు వచ్చింది.

'టెలిగ్రామా!' పక్క కొట్టు యజమాని కూడా సమీపించాడు.

'నువ్వే చదువు...'

చలమయ్యా గుండె కొట్టుకోసాగింది, కసాయి వాని మేకలా.

'బావా... చెల్లెలు రాము, ఆస్పత్రిలో వున్నారట... బస్సు ప్రమాదం జరిగిందట...'

చలమయ్యకి స్పృహ తప్పినంత పని అయింది.

'పెళ్లికని వెళ్లారు. బస్సు ప్రమాదానికి లోనయ్యారు. దుర్విధి బావా...నువ్వు కొంచెం తమాయించుకో. ఆస్పత్రిలో చేర్చారుగా... కోలుకుంటారు...' ఓదార్చాడు, కళ్లనీళ్లు పెట్టుకున్న చలమయ్యని.

గుమాస్తా చల్లని మంచినీళ్ల గ్లాసు అందించాడు యజమానికి. 'అబ్బాయిగారు పెళ్లంటే ఎంత సంబరపడ్డారని! పాపం...ఆస్పత్రిలో ఎలా వున్నారో యేమిటో!'

'రాము సంబరపడుతున్నాడనే పెళ్లికి పంపించాను. లేకపోతే అంత దూరం పంపిచేవాణ్ణా...?

'బావా!'

ఏమిటి? అన్నట్టుగా చలమయ్య చూశాడు.

'నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని, నేనిప్పుడే బయలు దేరతాను. ఇప్పుడు బస్సులో వెడితే తెల్లవారుజాముకి చేరుకుంటాను...గాభరా పడకుండా నువ్వు యింటికి వెళ్లు. గుమాస్తా కొట్టు చూసుకుంటాడులే..'

అంగీకార సూచకంగా తల వూపాడు చలమయ్య, నీటి కుండలైన కళ్లు తుడుచుకుంటూ.

ఆదరా బాదరా కొట్టు మూసి వేసి బయలు దేరాడు, పక్కకొట్టు యజమాని. వెడుతూ అన్నాడు. 'గుమాస్తా కుర్రాయనా, మా కొట్టుమీద కూడా ఒక కన్ను వేస్తూ వుండు.' అలాగే అన్నట్టుగా నవ్వి వూరుకున్నాడు.

చలమయ్యకి మనస్సు మనస్సులో లేదు. ఆస్పత్రిలో భార్య కొడుకు ఎంత అవస్థ పడుతున్నారో అనుకుంటూ కంట తడిపెట్టాడు. బస్సు ప్రమాదంలో వాళ్లకి గాయాలు బలంగా తగిలాయో యేమిటో. ఏమైనా జరిగితే తన గతి ఏం కాను? తానిప్పుడు అరవయ్యో పడిలో పడ్డాడు... లేకలేక పుట్టిన కొడుకు. ఇంట్లో ముసలి తల్లి. పాడు మనసు ప్రమాదాన్ని భీకరంగా చిత్రించడంతో, తగిలిన గాయాలు దయ్యాలై భయపెట్టడంతో చలమయ్యకి విపరీతపు ఆలోచనలు కలిగాయి. మనిషి వణికి పోయాడు. జరగకూడని సంఘటన జరిగినట్లుగా తలచి మరీ భీరువయ్యాడు. తానే ఆస్పత్రికి వెళ్లివుంటే బాగుండేదని అనుకున్నాడు...కాని పక్క కొట్టు యజమాని చెప్పినట్లుగా, ప్రమాదానికి పాల్పడిన ఆత్మీయుల్ని చూసి తాను భరించలేనని భావించాడు...తనను తాను ఓదార్చుకోడానికి ప్రయత్నించాడు. విఫలుడయ్యాడు.

'చలమయ్యగారు...'

పరిచితమైన కంఠస్వరం. లెక్కలు చూస్తున్న గుమాస్తా 'రండి, రండి' అప్యాయంగా అన్నాడు. అతి ప్రయత్నం మీద వచ్చిన నడివయస్సు వ్యక్తిని కళ్లతోనే కూర్చోమని చెప్పాడు చలమయ్య.

'ఇవ్వాళ్ల మీరేదో బాధలో వున్నట్టుగా కనిపిస్తోంది...' సందేహిస్తూ అన్నాడు వచ్చిన వ్యక్తి.

జరిగిన విషయాన్ని గుమాస్తా టూకీగా తెలియజేశాడు.

'దేవుడి దయవల్ల అంతా సక్రమంగానే వుంటుంది లెండి...పోయిన సంవత్సరం ఇలాగే బస్సు ప్రమాదానికి లోనయిన మా వదినగారు, ఆరేళ్ల పాప దైవికంగా తప్పించుకున్నారు. మేమంతా ఎంత భయపడ్డామనుకున్నారు...' అనుభవాన్ని జోడించి ధైర్యం చెప్పాడు.

ఎందుకో చలమయ్య మనస్సు భయాందోళనలనుంచి బయట పడలేకపోయింది.

'ఏం పనిమీద వచ్చారు?' గుమాస్తా అడిగాడు.

'మరేం లేదు...హైదరాబాదులో ఇంటర్వ్యూ అంటూ మా అబ్బాయికి నిన్న ఉత్తరం వచ్చింది. ఇప్పుడు నెలాఖరు చేతిలో చిల్లిగవ్వలేదు...'

'అవుననుకోండి. మూణ్ణెల్ల క్రితం పెట్టిన మరచెంబుని యింకా విడిపించుకోలేదు.'

'ఎప్పటికప్పుడు విడిపించాలనే తాపత్రయం. కాని ఖర్చుమీద కర్చు వచ్చిపడుతోంది..'

'పాతవి మూలుగుతుంటే కొత్తవాటి మీద డబ్బివ్వ వద్దని అయ్యగారు గట్టిగా చెప్పారు...' అన్నాడు గుమాస్తా ఉబుకుతున్న జాలిని చంపుకుని.

'అవసరానికని అడుగుతుంటే మనం మరీ నిక్కచ్చిగా వుండకూడదు. రేపు కొడుక్కి ఉద్యోగం వస్తే అన్నీ విడిపించుకుంటాడు...'

తన యజమానేనా యిలా అన్నది! ఆశ్చర్యంలో మునిగిపోయాడు గుమాస్తా.

'మీ రన్నది నిజం చలమయ్యాగారు. తప్పకుండా విడిపించుకుంటాను. ఆ వెండి మరచెంబు పెళ్లినాడు మా తాతగారు ప్రేమకొద్దీ నాకిచ్చారు...'

గుమాస్తా యజమాని వంకచూశాడు. ఆయన సుముఖంగా వున్నట్లు గ్రహించాడు.

'అయితే యిప్పుడేం తెచ్చారు పెట్టడానికి...' గుమాస్తా గొంతులో పూర్వపు కాఠిన్యం కనపించలేదు.

వచ్చిన వ్యక్తి చేతి సంచీలోంచి కంచం పైకి తీశాడు.

'అన్నం తినే కంచం ఎందుకండీ...'

'ఏం చేస్తాంబాబు...తప్పదు..'

ఆ నడివయస్సు వ్యక్తి కుటుంబ భారాన్ని మొయ్యలేకపోతున్నాడని అనాయాసంగా గ్రహించాడు చలమయ్య. ఆయన కొడుక్కి ఉద్యోగం రావాలని మనసారా అనుకున్నాడు.

'అయిదారు వందలు యివ్వచ్చు.' వెండి కంచం తూకం కట్టి గుమాస్తా అన్నాడు.

'కంచం కాదయ్యా ముఖ్యం...రాను పోను ప్రయాణం ఖర్చులు, అక్కడ భోజనం ఖర్చులు, దారి ఖర్చు అన్నీ చూడాలయ్యా... మీ కెంత కావాలి చెప్పండి...'

చలమయ్య ప్రదర్శించిన ఉదార భావానికి ఆశ్చర్యపోతూ, 'ఒక పదిహేనిప్పించండి' అన్నాడు ధైర్యంగా. పదిహేను వందలు తీసుకుని ఆయన వెళ్లాడు చలమయ్యకు కృతజ్ఞతలు చెపుతూ. యజమానిలో కలిగిన యీ ఆకస్మిక పరిణామానికి సంభ్రమాశ్చర్యాలు చెందాడు గుమాస్తా. లోలోన మెచ్చుకున్నాడు.

గల్లా పెట్టెకు తాళంవేసి, తాళం చెవిని జుబ్బా పక్క జేబులో పెట్టుకుని చలమయ్య లేచాడు. 'ఇంటికి వెళుతున్నా, మళ్లీ ఏమైనా కబురొస్తే వెంటనే నాకు తెలియజెయ్యాలి...' అన్నాడు గుమాస్తా నుద్దేశించి. 'కొట్టు కట్టేసింతర్వాత, తాళం చెవులు యింటికి తీసుకురా. తెలిసిందా...' అంటూ ఆయన బయలు దేరాడు. గుమాస్తా లేచి నిలబడ్డాడు.

వెళ్లిన కొంత సేపటికల్లా చలమయ్య తిరిగి వచ్చాడు, చేతి సంచితో, గుమస్తా నిర్ఘాంతపోయాడు. ఆయన ముఖ కవళికలు బట్టి జరగకూడనిది ఏదో జరిగిందని అనుకున్నాడు.

చలమయ్య చంటి పిల్లాడిలా యేడుస్తూ 'రాము దక్కడయ్యా...' అన్నాడు. జేబులోంచి టెలిగ్రాం తీసి. 'చదువు' అన్నాడు.

గుమస్తా చదివి విషయం చెప్పలేక చెప్పాడు. అతని కళ్లు అశ్రుపూరితాల యినాయి.

'శుభ కార్యానికి బయలుదేరి వెళ్లిన వాడికిలా అశుభం జరగాలా... అంతా చేసుకున్న పాపకర్మ... నేనక్కడికి వెళ్లేంత వరకైనా వుంటాడో వుండడో...' చలమయ్య మాట్లాడలేకపోయాడు.

'మీరు తొందరగా బయల్దేరి వెళ్లడం మంచిది'... మొదటి టెలిగ్రాం వచ్చిన వెంటనే వెళ్లి వుంటే బాగుండేది...

యజమాని చెప్పకుండానే కొట్టు తలుపులు మూసి తాళాలు బిగించాడు గుమాస్తా, పదండి అంటూ బస్సు స్టాండుకి దారితీశాడు.

యజమాని యాంత్రికంగా గుమాస్తా వెంట నడిచాడు. నాలుగడుగులు వేయగానే రిక్షా కనిపించింది. ఇద్దరూ ఎక్కారు. ఏనుగు లాంటి యజమాని పెంపుడు కుక్కలా కనిపించాడు!

లేకలేక పుట్టిన కొడుకు దుర్మరణం చెందడంతో చలమయ్యకి లోకం శూన్యంలా తోచింది. భార్య కుడిచేతికి బలమైన దెబ్బ తగిలింది. మందులు వాడినా ఫలితం లేకపోయింది. అవిటి చెయ్యి అయింది. కొడుక్కి యేర్పడిన దురవస్థ చూసి ఆ ముసలి తల్లి కన్నీరు మున్నీరుగా విలపించింది. చుట్టపక్కాలు చలమయ్యని ఓదార్చారు.

రోజులు నత్తనడకలా జరుగుతున్న కొద్దీ, కొట్టు పెత్తనం అంచెలంచెలుగా గుమాస్తా అధీనంలోకి వచ్చింది. గల్లాపెట్టె వద్ద కూర్చోవడమే యజమాని పని.

మధ్యాహ్న భోజనానికి గుమాస్తా వెళ్లబోతుంటే, యజమాని పిలుపు అతనికి వినవచ్చింది. అయ్యా అంటూ ఆయన్ని సమీపించాడు.

'నువ్వు పి.యు.సి. ప్యాసయ్యావుగదూ...'

'బి.యస్సీలో చేరి డబ్బు లేక...'

'నీకిప్పుడూ చదవాలనుందా?'

యజమాని వేసిన యీ ప్రశ్న గుమాస్తాని ఆందోళన పరిచింది. ఏం చెప్పాలో తోచలేదు.

'కొట్లో నేను పని చెయ్యకపోతే, మాకు గడవడం కొంచెం యిబ్బందేనండి. కనక...'

'సందేహించకుండా చెప్పవయ్యా' ప్రోత్సహించాడు యజమాని.

'కరస్పాండెన్స్‌లో చేరి డిగ్రీ పూర్తి చెయ్యాలని ఆశపడుతున్నా...'

'శుభం... మీ కెంత కావాలో చెప్పు. ఇచ్చే బాధ్యత నాది. నీ ఆశను పూర్తి చేసుకో...' అన్నాడు చలమయ్య.

యజమాని ముఖంలో చాలా రోజుల తర్వాత సంతోషం ప్రస్ఫుటమైనందుకు గుమాస్తా ఏనుగెక్కినంతగా సంతోషించాడు.

చలమయ్యలో తలపని తలంపుగా కలిగిన మార్పుని పక్కకొట్టు యజమాని గమనించకపోలేదు. గుమాస్తాని చూసినప్పుడల్లా అనసాగాడు. 'నక్కను తొక్కివచ్చావయ్యా'. తన కోరిక ఫలించనున్నదన్న ఆశాభావంతో ఆయన మాటల్ని అంతగా పట్టించుకునేవాడు కాదు.

ఒకరోజు చలమయ్య కొట్టు తెరుస్తున్నాడు.

'దరమం బాబూ'

వెనుదిరిగి చూశాడు. ఆ బిచ్చగాడే...

ఒక్క నిమిషం వుండు అంటూ గబ గబ కొట్టు తెరిచాడు చలమయ్య. గోడకు వేలాడుతున్న దేవుడి పటానికి నమస్కరించి, 'యిదిగో తీసికెళ్లు' అంటూ అతని చేతిలో ఒక నోటు వుంచాడు.

'పచ్చనోటు బాబూ...' బిచ్చగాడు అంటుంటే, ఆ రోజు తాను చేసిన ధర్మం సముద్రంలో కాకిరెట్ట పాటిదే అయినా... అది నా భార్యనైనా బ్రతికించింది.. తృప్తిగా అనుకున్నాడు చలమయ్య.